క్లుప్తంగా

అభివృద్ధి పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న రోజా

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డు కేబీఆర్ కాలనీలోని సీసీ రోడ్డు పనులను శనివారం చైర్ పర్సన్ కొలన్ రోజా పరిశీలించారు. నాణ్యతా పాటిస్తూ త్వరితగతిన పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్ సూచించారు.

ఎఫ్‌ఎల్‌టీ తనిఖీ



సమస్యను వివరిస్తున్న రమాకాంత్

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలం, కాజిపల్లి గ్రామం గండి చెరువు ఫుల్ ట్యాంక్ లెవెల్ సమస్యలపై ఫిర్యాదు అందుకున్న నీటి పారుదల శాఖ, పీసీబీ అధికారులు శనివారం గ్రామంలో పర్యటించి చెరువును పరిశీలించారు. ఇరిగేషన్ డిప్యూటీ ఈఈ రామస్వామి, ఏఈ ప్రసాద్ సమక్షంలో పీసీబీ అధికారి రవీందర్ చెరువులోని నీటి నమూనాలను సేకరించారు. గండి చెరువు ఎఫ్ టీఎల్ పరిధి రైతుల జీవనోపాధిపై ప్రభావం చూపుతుందని స్థానిక ఆర్‌కే ఫౌండేషన్ చైర్మన్ దండే రమాకాంత్, నాయకులు నవీన్‌కుమార్ అధికారులకు విన్నవించారు. ఎఫ్‌టీఎల్ సామర్థ్యాన్ని తగ్గించి రెవెన్యూ రికార్డుల నుంచి తొలగించాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ సభ్యులు సయ్యద్ రఫీ, రాజులు, మహేష్, పాల్గొన్నారు.

హనుమంతుడి సేవలో..



ఆలయంలో బారులు తీరిన భక్తులు

నారాయణఖేడ్: హనుమాన్ ఆలయాలు శనివారం భక్తులతో కిటకిటలాడాయి. ఖేడ్ మండలం కొండాపూర్‌లోని విశిష్ట చరిత్రగల హనుమాన్ ఆలయంలో హారతి, చందనం, అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు బారులుతీరి హనుమాన్‌ను దర్శించుకున్నారు. అనంతరం ఆలయ పీఠాధిపతి సంగ్రాం మహరాజ్ ఆశీస్సులు పొందారు. డోవురులొంక హనుమాన్ ఆలయంలోనూ భక్తులు పెద్దసంఖ్యలో హనుమంతుడిని దర్శించుకుని ప్రసాదాన్ని స్వీకరించారు. పట్టణంలోని కల్పనాహనుమాన్, అభయాంజనేయస్వామి ఆలయాలను భక్తులు సందర్శించారు.

మహాసభలకు తరలిన టీచర్లు



నారాయణఖేడ్: నల్గొండలో కొనసాగనున్న టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర మహాసభలు శనివారం ప్రారంభమయ్యాయి. ఇందులో పాల్గొనేందుకు ఖేడ్ నుంచి సంఘం బాధ్యులతో పాటు ఉపాధ్యాయులు తరలివెళ్లారు. డివిజన్ పరిధిలోని వివిధ మండలాల నుంచి ఖేడ్‌కు వచ్చి ఇక్కడి నుంచి పలు వాహనాల్లో నల్గొండకు తరలివెళ్లారు. వెళ్లిన వారిలో సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కాశీనాథ్ జాదవ్, జిల్లా, డివిజన్ బాధ్యులు ఏసుదాస్, శ్రీరాంనాయక్, దత్తురాం, నరేష్, హరిసింగ్, గోవింద్, వసునాయక్, రవి, యాదయ్య, చంద్రప్ప ఉన్నారు.

యువకుడి మృతదేహం లభ్యం

వట్‌పల్లి(అందోల్): అందోల్ మండలంలోని మాసానిపల్లి గ్రామ శివారులోని పెద్ద చెరువులో శనివారం ఓ యువకుడి మృతదేహం లభ్యమైంది. జోగిపేట ఎస్‌ఐ పాండు కథనం ప్రకారం.. చెరువులో మృతదేహంపైకి తేలియాడుతూ కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకొని మత్స్యకారుల సహకారంతో మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడి వద్ద లభించిన గుర్తింపు కార్డు ఆధారంగా సంగారెడ్డి మండలం పోతిరెడ్డిపల్లికి చెందిన శాంకరి శ్రీకాంత్ రెడ్డి (29)గా గుర్తించినట్లు చెప్పారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

యువకుడి మృతి

పటాన్‌చెరు: చికిత్స పొందుతూ ఓ యువకుడు మృతి చెందిన సంఘటన బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ స్వామి గౌడ్ కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాలకు చెందిన రఘురాంరెడ్డి (25), పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌లో ఉంటూ పాశమైలారం పారిశ్రామికవాడలోని ఎంటీఆర్ పరిశ్రమలో పని చేస్తున్నాడు. ఈ క్రమంలో గత శనివారం విధులు నిర్వహిస్తున్న సమయంలో వేడి నీటి ట్యాంకులో పడి తీవ్రంగా గాయపడ్డాడు. ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించి, పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

దశాబ్దాల కల నెరవేరబోతోంది..

- త్వరలో ఇంటిగ్రేటెడ్ రైతుబజార్ ప్రారంభం
- అన్ని వస్తువులు ఒకేచోట లభ్యం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం పట్టణవాసులు 20ఏళ్లగా ఎదురుచూస్తున్న రైతుబజార్ త్వరలో ప్రారంభం కానుంది. కూరగాయల మార్కెట్ లేక స్థానికులు చుట్టూ పక్కల ప్రాంతాల్లో జరిగే వారాంతపు సంతాలు, లింగంపల్లిలోని రైతుబజార్‌కు వెళ్లి తెచ్చుకోవాల్సిన పరిస్థితి. 2004లో రామచంద్రాపురం గ్రామపంచాయతీగా ఉన్న సమయంలో బొంబాయికాలనీలో రూ.40లక్షలతో రైతుబజార్‌ను నిర్మించారు. అప్పటి నుంచి 2021వరకు అందులోకి వ్యాపారస్తులు, రైతులు రాకపోవడంతో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, నాటి ఎమ్మెల్సీ వెన్నవరం భూపాల్‌రెడ్డి 2021లో రైతుబజార్‌ను ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌గా మారుస్తూ ప్రత్యేక నిధులను మంజూరు చేయించారు. ప్రస్తుతం పనులు పూర్తయి ప్రారంభోత్సవానికి సిద్ధమవుతోంది.



ప్రారంభోత్సవానికి సిద్ధమవుతున్న ఇంటిగ్రేటెడ్ రైతుబజారు

అన్ని వస్తువులు ఒకేచోట..

నూతనంగా నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ రైతుబజార్‌లో అన్ని వస్తువులను విక్రయించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. తాజా కూరగాయలు. పండ్లు, పూలు. మాంసం, నిత్యావసర సరుకులు తదితర వస్తువులు అందుబాటులో ఉండేలా రైతుబజారును నిర్మిస్తున్నారు.

మెరుగైన వసతులు..

రైతులకు, వ్యాపారస్తులకు, వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తాగునీరు, మరుగుదొడ్లు, చిన్నారులకు ఆటవస్తువులు, వాహనాల పార్కింగ్, సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు.

104దుకాణాలు ఏర్పాటు..

రైతుబజారులో నాలుగు భారీ షెడ్లను నిర్మించారు. అందులో 104 దుకాణాలను ఏర్పాటు చేశారు. కూరగాయలకు, మాంసం, పండ్లు.. దేనికి అది విడివిడిగా ఏర్పాటు చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్మాణం చేశారు. ఇంటిగ్రేటెడ్ రైతు బజారును నెలరోజుల్లో ప్రారంభించనున్నట్లు ప్రజాప్రతినిధులు సిద్ధమవుతున్నారు.

త్వరలో ప్రారంభిస్తాం..



గత ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ రైతుబజారుకు నిధులను మంజూరు చేసింది. నిర్మాణపనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ప్రజలకు నెలరోజుల్లో పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువస్తాం..

–సింధు, కార్పొరేటర్, భారతినగర్

ఇళ్ల నిర్మాణాలకు స్థలాలు వదలాలి

ఝరాసంగం(జహీరాబాద్): నిమ్జ్‌లో తమ తండాకు చెందిన భూముల్లో ఇళ్లు నిర్మించుకునేందుకు కేటాయించిన స్థలాలు వదలాలని చీలపల్లి తండావాసులు కోరారు. ఈ మేరకు శనివారం ఝరాసంగం రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ తిరుమలరావుకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హన్మంత్‌రావు పాటిల్‌తో కలిసి తండావాసులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తండాలో సుమారు 100 కుటుంబాల వరకు నివసిస్తున్నాం. భవిష్యత్తులో 120, 117 సర్వే నంబర్లలో ఇళ్లు నిర్మించుకునే అవకాశం ఉందన్నారు. గతంలో నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో తండా శివారులోని భూములు తీసుకోబోమని తెలిపినట్లు వివరించారు. ఇప్పుడు నిమ్జ్ కోసం తీసుకునేందుకు చూస్తున్నారని, అధికారులు పరిశీలించి, తమకు ఇళ్లకు కేటాయించిన స్థలాలను వదిలేయాలని విన్నవించారు. కార్యక్రమంలో నాయకులు చందర్, శివాజీరాథోడ్, సుధాకర్, కాశినాథ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

పశువులకు టీకాలు తప్పనిసరి

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): మండలంలోని వెంకటాపూర్‌లో శనివారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువుల సంరక్షణపై పశు వైద్యాధికారులు పాడి రైతులకు సలహాలు, సూచనలు చేశారు. అనంతరం మండల పశువైద్యాధికారి సంతోష్ కుమార్ మాట్లాడుతూ.. ఆవులు, గేదెలు వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. పశువులకు అన్ని రకాల టీకాలు వేయించాలని చెప్పారు. సమీకృత దాణా వాడటం వల్ల ఎక్కువ పాలు దిగుబడి పొందవచ్చని సూచించారు. పశువులకు కృతిమ గర్భధారణ, సాధారణ చికిత్సలు చేయించాలని తెలిపారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది, రైతుకు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న సీడీపీఓ అంజమ్మ తదితరులు

జహీరాబాద్ టౌన్: అంగన్‌వాడీ కేంద్రాల్లో అమలు చేయనున్న పూర్వ ప్రాథమిక విద్యకు సంబంధించి టీచర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. పట్టణంలోని ఆర్‌ఎల్‌ఆర్ స్కూల్ ఆవరణలో అజీమ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణ తరగతులకు జహీరాబాద్ ప్రాజెక్టు పరిధిలోని 260 మంది అంగన్‌వాడీ టీచర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సీడీపీఓ అంజమ్మ మాట్లాడుతూ.. పిల్లలకు ఆటపాటలతో కూడిన సులభమైన పూర్వ ప్రాథమిక విద్యను బోధించాలని సూచించారు. 392 మంది అంగన్‌వాడీ టీచర్లు ఉండగా ప్రస్తుతం ఒక బ్యాచ్‌కు శిక్షణ ఇచ్చామన్నారు. పిల్లలకు సులువుగా ఆట పాటలు, కథలు, మాటలు ద్వారా సులభంగా బోధించే విధానం గురించి వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు అనిత, తులజమ్మ, విజయలక్ష్మి, రాధమ్మ, సద్గుణ, అజీమ్ ఫౌండేషన్ నిర్వాహకులు కోటేశ్వర్‌రావు, వెంకటరమణ, వెంకటసాయి, సుజాతలు పాల్గొన్నారు.

అనాథ పిల్లల దత్తత



అనాథ పిల్లలతో ఉపాధ్యాయులు

కంది(సంగారెడ్డి): మండల కేంద్రం కందిలోని లక్ష్మీనగర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లీలావతి ముగ్గురు అనాథ పిల్లలను దత్తత తీసుకున్నారు. లక్ష్మీనగర్‌కు చెందిన సాయితేజ, తేజ, విగ్నేశ్వర్‌లను శనివారం దత్తత తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యాభ్యాసం పూర్తి అయ్యేవరకు అవసరమైన ఖర్చులను భరిస్తానని తెలిపారు. టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్, రాష్ట్ర కౌన్సిలర్ ఖమరోద్దీన్, మండల అధ్యక్షుడు సిద్దేశ్వర్, ఉపాధ్యాయులు ప్రమీలా, చంద్రమోహన్ తదితరులు ఆమెను అభినందించారు.

ఆలయ నిర్మాణానికి సహకారం

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న పోచమ్మ ఆలయ నిర్మాణానికి దాతలు విరాళాలు అందజేశారు. శనివారం పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ లక్ష రూపాయలు, తెల్లాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ లలిత సోమిరెడ్డి ఒకటిన్నర టన్నుల స్టీల్, ఐలాపూర్ బీఆర్ఎస్ నేత మణిక్ యాదవ్ 150 బస్తాల సిమెంట్ అందజేశారు. ఆలయ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందించేందుకు కృషి చేసిన దాతలను కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర యువత నాయకులు వెంకటేశం గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు నరసింహారెడ్డి, లింగం, రాము, వెంకటేశ్, మల్లేష్ పాల్గొన్నారు.



మెట్టుకుమార్‌తో ఆలయ కమిటీ సభ్యులు

వరినారును సంరక్షించాలి



సూచనలు చేస్తున్న నూతన్‌కుమార్

కల్హేర్(నారాయణఖేడ్): చలి తీవ్రత నుంచి వరినారును సంరక్షించాలని నారాయణఖేడ్ ఏడీఏ నూతన్‌కుమార్ తెలిపారు. శనివారం కల్హేర్ మండలం మీర్ఖాన్‌పేట్, నిజాంపేట్ మండలం రాంరెడ్డిపేటలో వరినారు మడులను ఆయన పరిశీలించారు. నారు దెబ్బతినకుండా పాటించాల్సిన చర్యలపై రైతులకు అవగాహన కలిపించారు. కార్యక్రమంలో ఏఈఓలు వంశీగౌడ్, కృష్ణావేణి, రైతులు భూమేష్, మానిక్యం పాల్గొన్నారు.

లబ్ధిదారులు ఇంటి దగ్గర ఉండాలి

మునిపల్లి(అందోల్): ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు ఇళ్ల వద్ద ఉండాలని ఎంపీడీఓ హరినందన్‌రావు శనివారం ఒక ప్రకటనలో ప్రజలను కోరారు. ఇళ్ల మంజూరుకు సర్వే చేసి పేర్లను పంచాయతీ కార్యదర్శులు ఎప్పటికప్పుడు నమోదు చేస్తున్నారన్నారు. నమోదు చేస్తున్న సమయంలో ఇళ్ల దగ్గర లేక పోవడంతో ఇబ్బందిగా మారిందన్నారు. పంచాయతీ కార్యదర్శులు వచ్చిన సమయంలో ఇంటి దగ్గర ఉండి ఫొటో దిగాలని సూచించారు. ఈ నెల 31 వరకు సర్వే చేసి లబ్ధిదారుల పేర్లను నమోదు చేయడానికి అవకాశం ఉందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

బీజేపీ నాయకుడికి పరామర్శ



నాగ ప్రభుగౌడ్‌ను పరామర్శిస్తున్న ఎంపీ

హత్నూర(సంగారెడ్డి): హత్నూర మండల బీజేపీ అధ్యక్షుడు నాగ ప్రభుగౌడ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న మెదక్ ఎంపీ రఘునందన్‌రావు శనివారం అతడిని పరామర్శించారు. అవసరమైతే మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. నాగ ప్రభు కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు.

జమిలి ఎన్నికలతో ప్రజాస్వామ్యం ఖూనీ

సంగారెడ్డి ఎడ్యుకేషన్: ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం జమిలి ఎన్నికల నిర్వహణకు సమాయత్తమవుతుందని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి జయరాజు అన్నారు. సంగారెడ్డిలోని కిషన్‌భవన్‌లో సీపీఎం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కార్మికులు, రైతులు, పేద ప్రజల వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ అన్ని రంగాల ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ సంస్థలను కార్పొరేట్ శక్తులకు అప్పగించే పద్ధతిని ఉపసంహరించుకోవాలన్నారు. మత విద్వేషాలను రెచ్చగొట్టి ప్రజల మధ్య వైషమ్యాలను పెంపొందించి పాలన సాగించాలని చూస్తున్న బీజేపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పే రోజులు త్వరలో రానున్నాయని దుయ్యబట్టారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నర్సింలు, సంగారెడ్డి డివిజన్ కార్యదర్శి యాదగిరి, సీపీఎం నాయకులు బాలరాజ్ , శ్రీనివాస్, శోభ, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జయరాజు

అక్రమ కట్టడాలను తొలగించండి

- అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

సంగారెడ్డి జోన్: రహదారి పక్కన నిర్మించిన అక్రమ కట్టడాలను తొలగించి, ప్రమాదాలు జరగకుండా చూడాలని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ ఆదేశించారు. శనివారం సంగారెడ్డి కలెక్టరేట్‌లో జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత శాఖల అధికారులతో అదనపు కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో పోలీసు, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించి రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాదాల నివారణలో భద్రతా చర్యలు కీలకమన్నారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి, అక్కడ అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. సమస్యల పరిష్కారానికి సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. నేషనల్ హైవే 16 ఎక్సటెన్షన్ పనులు జరుగుతుండటంతో, ట్రాఫిక్ నియంత్రణ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకపోవడం ప్రమాదాలకు ప్రధాన కారణమని, అందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ప్రమాద ప్రదేశాల్లో రుంబుల్ స్ట్రిప్స్, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో ఆర్‌అండ్‌బీ, ఈఈ రాంబాబు, నేషనల్ హైవే అథారిటీ అధికారులు, పంచాయతీరాజ్ అధికారులు, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

సస్యరక్షణ చర్యలు తప్పనిసరి



శనగ పంటను పరిశీలిస్తున్న ఏఓ, తదితరులు

ఝరాసంగం(జహీరాబాద్): శనగపంటలో రైతులు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి వెంకటేశ్వర్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని బర్దిపూర్ గ్రామంలో రైతులు సాగు చేసిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శనగ పంట 20 నుంచి 30 రోజుల్లో ఉందన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితి అధిక వర్షపాతం, మబ్బులతో కూడిన వాతావరణం వల్ల రబ్బరు పురుగు, ఉధృతి ఎక్కువగా ఉంటుందన్నారు. దీని నివారణకు క్వినాల్ పోస్ 400 ఎంఎల్ ఎకరానికి లేదా క్లోరిపైరిపోస్ 400 ఎంఎల్ వారం రోజుల వ్యవధిలో 2- 3 సార్లు పిచికారీ చేయాలన్నారు. ఎండు తెగులు నివారణ కాపర్ ఆక్సిక్లోరైడ్ పిచికారీ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విస్తరణ అధికారి వినోద్, రైతులు కాశినత్ పటేల్, దిగంబర్, సృజన్, పండరి, వీరయ్య స్వామి, మాణిక్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పరిశీలన

పటాన్‌చెరు టౌన్: చిట్కుల్‌లో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను శనివారం పటాన్‌చెరు ఎంపీడీఓ యాదగిరి పరిశీలించారు. గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రజల ఇళ్లకు సర్వే బృందాలు వెళ్లి తనిఖీ చేస్తున్నారు. సర్వే బృందం ఇంటిని, దరఖాస్తు దారుల ఖాళీ స్థలాన్ని ఫొటో తీసి అప్‌లోడ్ చేస్తున్న తీరును చూశారు. ఎన్ని ఇళ్లు సర్వేపూర్తి చేశారని పంచాయతీ సిబ్బందిని అడిగారు. కారోబార్ క్రిష్టయ్య గ్రామం నుంచి 1708 దరఖాస్తుల వచ్చాయని వాటిలో 918 ఇళ్లలో సర్వే పూర్తి చేసుకున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. చిట్కుల్‌లో, ఇస్నాపూర్, రుద్రారం, క్యాసారం గ్రామాల్లో సర్వే నెమ్మదిగా జరుగుతుందని తెలిసి పరిశీలనకు వచ్చానన్నారు. అన్ని గ్రామాల్లో సర్వే వేగవంతం చేయాలని ఆదేశించారు.



సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

31న సదరం క్యాంపునకు స్లాట్స్

మునిపల్లి(అందోల్): ఈ నెల 31న సదరం క్యాంపునకు స్లాట్ బుక్ చేసుకోవాలని ఎంపీడీఓ హరినందన్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 7న సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో సరదం క్యాంపు నిర్వహించనున్నట్లు చెప్పారు. క్యాంపునకు వచ్చే వారు వద్ద బుకింగ్ రశీదు తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. ఆధార్ కార్డు, పాస్‌ఫొటో, సంబంధిత మెడికల్ రిపోర్ట్ తప్పనిసరిగా వెంట తీసుకురావాలని సూచించారు.

భక్తితోనే ముక్తిమార్గం

- ఎంపీ రఘునందన్‌రావు

సదాశివపేట(సంగారెడ్డి): మానవుడికి భక్తిమార్గంతోనే ముక్తి లభిస్తుందని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు పేర్కొన్నారు. పట్టణంలోని 11వ వార్డు కౌన్సిలర్ ఓదెల రాజేశ్వరి మాణిక్‌రావు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కాశమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనకు మెదక్ ఎంపీ రఘునందన్‌రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య వినాయక, పుణ్యాహవాచనం, దేవత ఆవాహన, అగ్ని ప్రతిష్ఠ, జనాది, ధ్యానాది, శయ్యాది వాసనములు, అనంతరం విగ్రహ ప్రతిష్ఠ, బలిప్రదానం, పూర్ణహూతి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ధార్మిక చింతన కలిగి ఉన్నప్పుడే మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. సన్మార్గంలో నడుచుకోవాలని సూచించారు. విగ్రహ ప్రతిష్ఠ అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ కోవూరి సంగమేశ్వర్, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి , నాయకులు రాజేశ్వర్‌రావుదేశ్‌పాండే, జగన్, శ్రీనివాస్, శ్రీశైలం, చిదానందం, విజయ్‌కుమార్, ఆకుల పాండు, భక్తులు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న ఎంపీ రఘునందన్‌రావు

వ్యక్తి అదృశ్యం



రమేష్

జహీరాబాద్ టౌన్: మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యమైన సంఘటన మొగుడంపల్లి మండలంలోని ధనసిరి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ రాజేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన వడ్ల రమేష్ (23), మతిస్థిమితం సరిగ్గా లేదు. తండ్రి ఎల్లప్ప చికిత్స చేయించిన ఆరోగ్యం మెరుగుపడలేదు. ఈ నెల 13న ఇంట్లో ఎవరికి చెప్పకుండా రమేష్ బయటకు వెళ్లిపోయాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో చుట్టుపక్కల బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

నారాయణఖేడ్: పట్టణానికి చెందిన కుమ్మరి పండరికి సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన రూ.60వేలు చెక్కును మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అందజేశారు. ఖేడ్ మాజీ జెడ్పీటీసీ లక్ష్మీబాయి , మున్సిపల్ మాజీ చైర్మన్ నజీబ్, మాజీ వైస్ చైర్మన్ పరశురాం, పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు నగేష్, టీఆర్ఎస్‌వీ అధ్యక్షుడు అంజాగౌడ్ పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే

మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు నివాళి



నివాళులర్పిస్తున్న నరేష్‌గౌడ్ తదితరులు

జహీరాబాద్ టౌన్: భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతిపై యువజన కాంగ్రెస్ నాయకులు సంతాపం తెలిపారు. యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నరేష్ గౌడ్ ఆధ్వర్యంలో పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నరేష్‌గౌడ్ మాట్లాడుతూ.. సాధారణ జీవితాన్ని గడిపి, దేశాభివృద్ధికి ఆయన చూపిన శ్రద్ధ అందరికీ ఆదర్శప్రాయమన్నారు. ఆయన మృతి దేశానికి తీరనిలోటని, దేశం మంచి నేతను కోల్పోయిందన్నారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు వసీం, రఘు, సంతోష్ రెడ్డి, విష్ణు, శ్రీకాంత్, ప్రేమ్, వినోద్, షౌకత్, నూరి పాల్గొన్నారు.